క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రకాశం నగర్: క్రీడలతో మానసిక ఉల్లాసం, మనోవికాసం కలుగుతాయని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దొండపాటి శంకర్రావు, ఎస్.మూర్తి, అనిల్, సుదర్శన్ రాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో గెలుపు, ఓటమి ఉంటాయన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్లు అందజేశారు. కార్యక్రమంలో పీవీపీ సంజీవరావు, ఎస్.వెంకటేశ్వరరావు, కె.బుజ్జి, సిరా గంగాధరరావు, పీఏ కిషోర్ బాబు పాల్గొన్నారు.

వేలివెంటి రాజాకు పురస్కారం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకుంటున్న రాజా

ధవళేశ్వరం: గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేలివెంటి వెంకట సత్యనాగ వరప్రసాద్ (రాజా) తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును అందుకున్నారు. రచయితగా ఆయన అందిస్తున్న సేవలను సకల కళా ప్రదర్శనలు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ గుర్తించింది. విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పతకం, అవార్డులను ప్రదానం చేసింది. సభాపతి మంగళంపల్లి చంద్రశేఖర్, గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యదర్శి రాచూరి రామకృష్ణ, కోశాధికారి ఆదుర్తి విశ్వమోహన్ తదితరులు మాట్లాడుతూ రాజాకు అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజాను అభినందించారు.

స్కూళ్లు తెరిచే నాటికే పాఠ్య పుస్తకాలు

కంబాలచెరువు: నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేలా ఏర్పాట్లు చేస్తామని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. తరగతుల వారీగా, సబ్జెక్టుల వారీగా ఎన్ని పుస్తకాలు వచ్చాయి, ఇంకా ఎన్ని రావాలి తదితర అంశాలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

ఉపాధి కూలీకి పాముకాటు



కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవుడమ్మ

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ చోడువాడ దేవుడమ్మ పాముకాటుకు గురైంది. ఆమె సోమవారం ఉదయం పనిలో ఉండగా పాము కరిచింది. వెంటనే ఉపాధి సిబ్బంది కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం తరలించినట్లు ఎంపీడీవో జి.రాజమనోజ్ తెలిపారు.

వంకర పాదాలకు చికిత్స సాధ్యమే

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ప్రపంచ వంకర పాదాల దినోత్సవం నిర్వహించారు. ఆసుపత్రిలోని డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ (డైస్) సెంటర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వంకర పాదాలు పిల్లలలో పుట్టుకతోనే వస్తాయన్నారు. వాటికి సకాలంలో చికిత్స అందించడం ద్వారా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, డాక్టర్లు హరిచంద్ర, చంద్రశేఖర్, మోహన్ చంద్ర, ప్రశాంత్ కుమార్, జె.విశ్వనాథ్, అంజలి, మిల్లన్ డైస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు



వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

కడియం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని 104 సిబ్బంది అప్పారావు అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులను వివరించారు. 20 రోజులుగా నేర్చుకున్న కథలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నీతి కథలు పుస్తకాలను బహుమతిగా ఇచ్చారు. పేపర్ మిల్ ఉద్యోగి భాస్కరరావు, సురేష్, రాజేష్, రిషిత తదితరులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

చిన్నారి బాని సెల్

- పెరుగుతున్న స్మార్ట్ ఫోన్ల వినియోగం
- పిల్లలకు నష్టాలు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

కంబాలచెరువు: సెల్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవడం అందరికీ అవసరమే. ఈ రోజుల్లో సెల్‌ఫోన్ లేనిదే ఒక్క పనికూడా జరగదు. జేబులో రూపాయి లేకపోయినా పర్వాలేదు, కానీ సెల్‌ఫోన్ లేకపోతే కష్టమే. కానీ చిన్నపిల్లలకు మాత్రం సెల్‌ఫోన్ల వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయి. గంటల తరబడి ఫోన్ చూడడం వల్ల వారి మెదడుపై చెడు ప్రభావం పడుతోంది. ఆటలు ఆడకపోవడంతో చురుకుతనం తగ్గిపోతోంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో వస్తున్న మీమ్స్, జోకులు, షార్ట్స్‌ను చిన్నారులు ఫాలో అవుతున్నారు. ఏది మంచో, ఏది చెడో తెలియని వయసులో తప్పుడు విషయాలను బుర్రకెక్కించుకుంటున్నారు. వాటిలోకి చెడుకు కూడా ఆకర్షితులవుతున్నారు. అలాగే గేమ్స్ కూడా విపరీతమైన అనర్థాలను కలిగిస్తున్నాయి.

పోలీసు శాఖ చర్యలు

సెల్‌ఫోన్ వల్ల కలుగుతున్న అనర్థాలను ఆపడానికి పోలీసు శాఖ నడుం బిగించింది. రాజమహేంద్రవరం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దిశ, లా అండ్ ఆర్డర్ పోలీసులు కలిసి సమాజంలో బాలికలకు సోషల్ మీడియా వల్ల జరుగుతున్న నష్టాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా ఆడ పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్‌లపై అవగాహన కల్పిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు, తరగతి గదిలో బోధకులు, తోటి పిల్లలు ఎవరైనా శరీర భాగాలను టచ్ చేస్తున్నప్పుడు ఏది మంచి, చెడో తెలిసే విధంగా బొమ్మలతో అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సోషల్ మీడియా ప్రభావంతో తప్పుడు మార్గంలో వెళుతుంటే ఏ విధంగా దానిలోంచి బయటకు రావాలో తెలియపరుస్తున్నారు.

లింక్‌లను క్లిక్ చేస్తే అనర్థాలు

సెల్‌ఫోన్లకు వచ్చిన అనవసర లింక్‌లను క్లిక్ చేయడం వల్ల జరిగే నష్టాలను వివరిస్తున్నారు. వాట్సాప్‌కు వచ్చిన లింక్ క్లిక్ చేసిన తర్వాత వీడియో కాల్ ద్వారా అవతలి వ్యక్తులు సదరు బాలికను ఏ విధంగా బ్లాక్ మెయిల్ చేస్తున్న సంఘటనలను తెలియజేస్తున్నారు. గుర్తుతెలియని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్‌కు దూరంగా ఉండాలంటున్నారు. అటువంటి నేరాలకు గురైనప్పుడు 100 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఆపదలో ఉన్న మహిళకు రక్షణగా దిశ యాప్ ఉందని, దీనిని డౌన్ లోడ్, రిజిస్ట్రేషన్ చేసుకుని పోలీసులు సూచిస్తున్నారు. తక్షణ సహాయం కోసం 112 నంబర్‌కు డయల్ చేయాలని కోరుతున్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. బాలికలు ప్రేమ, పెళ్లి అనే మాటను పక్కన పెట్టి చదువుపై దృష్టి సారించి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని హితవు పలుకుతున్నారు.

అవగాహనతో మెలగాలి



యువత తమ బంగారు భవిష్యత్తును కలలు కంటూ, దాన్ని సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగాలి. సెల్‌ఫోన్, సోషల్ మీడియా వలలో చిక్కుకుని అందమైన జీవితాన్ని నరక ప్రాయం చేసుకోకూడదు. ఇటీవల ఈ ఘటనలు అధికమయ్యాయి. దీనిపై మా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముఖ్యంగా బాలికలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. ఇందులో భాగంగా స్కూళ్లలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– శివాజీ, ఎస్సై, రాజమహేంద్రవరం త్రీటౌన్

215 మందికి వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు రాయుడు శ్రీనివాస్, సత్యం రమేష్ బాబు వైద్యసేవలు అందించారు. శ్రీరామకృష్ణ మఠం శిబిరంలో 160 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి శిబిరంలో 55 మందికి కంటి పరీక్షలు జరిపారు. 13 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఆసుపత్రికి తరలించారు. శిబిరాలకు తరలివచ్చిన రోగులు, వైద్యులకు గద్దె గోపి ఫణీంద్ర కుమార్, సీతాదేవి దంపతులు భోజనం సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డి సేవలు ఆదర్శనీయం



విశ్వేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యారత్న డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డికి బ్రిటిష్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ క్వీన్ మేరీ సోషల్ సర్వీసెస్‌లో హానరరీ డాక్టరేట్ ప్రదానం చేయడం నగరానికి గర్వకారణమని రాజమహేంద్రవరం సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఓఎన్జీసీ ఎసెట్ మాజీ మేనేజర్ డీఎంఆర్ శేఖర్ కొనియాడారు. సామాజిక సేవతో పాటు గోదావరి కలుషితం కాకుండా కాపాడుకోవాలనే లక్ష్యంతో కొనసాగుతున్న విశ్వేశ్వరరెడ్డి సేవలు అందరికీ ఆదర్శనీయమన్నారు. డాక్టరేట్ పొందిన ఆయనను సోమవారం రాజమహేంద్రి మహిళా కళాశాల ఆవరణలో వివిధ వర్గాల నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా డీఎంఆర్ శేఖర్ మాట్లాడుతూ సేవాభావంతో పాటు గోదావరి కలుషితం కాకుండా చూడాలని ఉద్దేశంతో విశ్వేశ్వరరెడ్డి నిరాహార దీక్ష చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, ఓఎన్జీసీ విశ్రాంత ఉద్యోగి విజయ పాల్, ఎల్వీ ప్రసాద్, సీనియర్ న్యాయవాది ఏపీ స్టేట్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు మర్రి బాబ్జీ, ఎస్సీ,ఎస్టీ, బీసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కార్తీక్ సింగంపల్లి, జిల్లా నాయకులు దొమ్మేటి స్వర్ణకుమార్, తండాపు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దాస సాహిత్య ప్రాజెక్టు శిక్షణ ప్రారంభం



కార్యక్రమానికి హాజరైన సంగీత అభిమానులు



కీర్తనలు ఆలపిస్తున్న దాస సాహిత్య సభ్యులు

సీటీఆర్ఐ: భగవంతునికి దాసుడిగా సేవ చేస్తూ జీవించడం అంటే మోక్షానికి చేరువ కావడమేనని దాస సాహిత్య ప్రాజెక్టు రాజమహేంద్రవరం శాఖ నిర్వాహకురాలు మంచిరాజు హేమలత అన్నారు. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణం మండపంలో దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం దాస సాహిత్య వాగ్గేయ కారులు కీర్తనలలో శిక్షణ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 9 గంటలకు ప్రార్థనలో మొదలైన ఈ కార్యక్రమంలో ప్రముఖ వాగ్గేయకారులు కీర్తనలను ఇక్కడికి వచ్చిన వారికి నేర్పిస్తున్నారు. 5వ తేదీన దాస సాహిత్య ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు విచ్చేసి ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నారు.

ఆలయాల భూములకు కౌలు వేలం ఖరారు

సీతానగరం: మండలంలోని పలు ఆలయాల భూములకు మూడేళ్ల కౌలు హక్కు కోసం సోమవారం దేవదాయ ధర్మదాయశాఖ ఈవో సోమాల శివ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు.

- రఘుదేవపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 7.78 ఎకరాలకు వేలం నిర్వహించగా అదే గ్రామానికి చెందిన ఎస్.గంగరాజు, ఏ.సహదేవుడు, జి.ఉమా శంకర్, జి.కృష్ణ, సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఏడాదికి రూ. 3.29 లక్షలకు పాడుకున్నారు. అలాగే సర్వే నంబర్ 82/1లో 0.71 సెంట్లు భూమిని పరిశీలించిన అనంతరం వేలం పాట నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.
- సీతానగరంలోని సీతారామస్వామి దేవస్థానానికి చెందిన 10.42 ఎకరాలకు వేలం నిర్వహించగా చినకొండేపూడికి చెందిన లక్కిశెట్టి కృష్ణ రూ.3.61 లక్షలకు దక్కించుకున్నాడు.
- మిర్తిపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థానం భూములు 10.76 ఎకరాలను అదే గ్రామానికి చెందిన ఎన్.హరీష్, డి.రాంబాబు రూ.2.24 లక్షలకు కైవసం చేసుకున్నారు.


చంద్రశేఖరస్వామికి రేపు అభిషేకాలు



చంద్రేడు చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామివారికి బుధవారం మాసశివరాత్రి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ శర్మ తెలిపారు. కావున అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అన్నాభిషేకం.. గారెల అలంకారం



కడియపులంకలో అనంతేశ్వరుడికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకుడు



గారెల అలంకరణలో ఆంజనేయస్వామి

కడియం: కడియపులంక హరిహర మహాక్షేత్రంలోని అపర్ణా సమేత అనంతేశ్వరస్వామివారికి సోమవారం అన్నాభిషేకం చేశారు. ఆలయం 15వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకుడు దేవరభట్ల శ్రీనివాసశర్మ నేతృత్వంలో అర్చక స్వాములు మంత్రోచ్ఛారణతో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అనంతేశ్వరునికి మహా అన్నాభిషేకం చేసి, ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

గారెల అలంకరణలో హనుమాన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హనుమజ్జయతి ఉత్సవాలలో భాగంగా రాజమహేంద్రవరం ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామిని సోమవారం గారెల దండలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వర్తకులు, రైల్వే ఉద్యోగులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండే ఎండైనా ఈ రోడ్లలో ఆహ్లాదమే



గుమ్ములూరు - బుచ్చెంపేట రోడ్డులో చెట్లు

మధురపూడి: మండుతున్న ఎండలకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచే మొదలవుతున్న భానుడి సెగలకు భయపడుతున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావడం లేదు. ప్రస్తుతం అడపాదడపా వానలు పడుతున్నా పూర్తిస్థాయిలో భూమి చల్లబడడం లేదు. ఎండల కారణంగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అయితే కొన్ని రహదారులు మాత్రం దీనికి భిన్నంగా ఆహ్లాదం కలిగిస్తున్నాయి. వాటికి ఇరువైపులా ఉన్న చెట్లు వాహన చోదకులను సేద తీరుస్తున్నాయి. ఆ రోడ్లలో ప్రయాణం సౌకర్యంగా ఉండడంతో పాటు కాసేపు చెట్ల కూర్చుని ప్రయాణికులు సేదతీరుతున్నారు. ఎండల్లో కూడా కోరుకొండ మండలం గుమ్ములూరు–ఉండేశ్వరపురం, మధురపూడి విమానాశ్రయం–తొర్రేడు రోడ్లు చాలా సౌకర్యవంతంగా ఉంటున్నాయి.

కొనసాగుతున్న వేసవి శిబిరం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.మల్లికార్జునరావు సోమవారం శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. చదవడం మాకిష్టంలో భాగంగా కథ వినడం, పుస్తక పఠనం, ఆటలు, చదరంగం పోటీలు, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం వంటివి నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు నేటితో తెర

- నేడే సార్వత్రిక ఎన్నికల తుది తీర్పు వెల్లడి
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే



అనపర్తి: సార్వత్రిక ఎన్నికల సమరంలో తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. దీంతో దాదాపు 22 రోజుల ఉత్కంఠకు తెరపడనుంది. ఎన్నికల ఫలితాలపై అభ్యర్థులతో పాటు నియోజకవర్గ ప్రజలూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓటర్ల తుది తీర్పు మరికొద్ది గంటల్లోనే వెల్లడి కానుంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులు సర్వం సిద్ధం చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కించి పూర్తి ఫలితాలను ప్రకటించనున్నారు. గెలుపుపై వైఎస్సార్ సీపీ, బీజేపీ అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఓట్లు ఎటు పడ్డాయో?

గత నెల 13న జరిగిన సాధారణ ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 9 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిల మధ్యనే ప్రధాన పోరు జరిగింది. నియోజకవర్గంలో మొత్తంగా 2,26,053 మంది ఓటర్లు ఉండగా 1,94,924 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 96,161 మంది పురుషులు, 98,761 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 86.23 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో మహిళలు, వృద్ధులు, యువత ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది మొదలు ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇప్పటివరకు బూత్‌లు, గ్రామాల వారీగా ఓట్ల లెక్కలతో కుస్తీ పట్టారు. ఏఏ గ్రామాల్లో తమకు ఎన్ని ఓట్లు పడ్డాయి? ఎక్కడెక్కడ ఎంతెంత మెజార్టీ వస్తుంది ? అనే కోణంలో ఆయా గ్రామాల్లో తమ పార్టీకి చెందిన అనుచరులు, ముఖ్య నాయకుల ద్వారా సమాచారం సేకరించి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మహిళల ఓట్లు ఏ పార్టీకి కలిసి వస్తే ఆ పార్టీ విజయం సాధిస్తుందని సీనియర్ రాజకీయ నేతలంటున్నారు. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపునకు నియోజకవర్గంలో 228 బూత్‌లకు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తంగా 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తికానుంది.

మూడోసారి విజయం ఎవరిది?

వైఎస్సార్ సీపీ తరఫున బరిలో నిలిచిన డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, బీజేపీ తరఫున పోటీ చేసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గత నెల 13న జరిగిన ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి తలపడ్డారు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 1,373 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి 55,208 ఓట్ల మెజార్టీతో గెలుపొంది రికార్డులు తిరగరాశారు. ఇప్పటివరకూ అనపర్తి నియోజకవర్గంలో జరిగిన 15 ఎన్నికల్లో ఇదే అత్యధిక మెజార్టీ. దీంతో ముచ్చటగా మూడోసారి జరిగిన ఈ దఫా ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందోనని ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుపొందితే రాష్ట్రంలోనూ అదే పార్టీ అధికారం చేపడుతుందన్న సెంటిమెంట్ ప్రజల్లో నెలకొంది. పైగా సర్వే సంస్థలన్నీ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిచే సీట్లలో మొదటిదిగా అనపర్తి అసెంబ్లీ పేరే చెబుతూ వచ్చాయి. నిస్వార్థంగా రాజకీయం చేసే డాక్టర్ సత్తి సూర్యనారాయ్ణరెడ్డికి ప్రజల్లో అమితమైన ఆదరణ ఉండడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల కారణంగా ఆయన మళ్లీ భారీ మెజార్టీతో విజయం సాధించే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం ఉదయం జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కించనున్నారు. రాజానగరం నియోజకవర్గానికి సంబంధించిన ఓట్లను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్ భవనం కింది అంతస్తులో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లను, మొదటి అంతస్తులో అసెంబ్లీ నియోజకవర్గ ఓట్లను, పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. నియోజకవర్గ పరిధిలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో 2,16,491 మంది ఓటర్లు ఉండగా 216 పోలింగ్ కేంద్రాల ద్వారా మే 13న జరిగిన పోలింగ్‌లో 1,89,508 మంది ఓటు చేశారు. వీటితో పాటు 1,531 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. ఈ ఓట్ల కౌంటింగ్‌ను 16 రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు నాలుగు టేబుళ్లు, ట్యాబ్‌లేషన్ టేబుళ్లు రెండు ఉంటాయి. 15 రౌండ్లు పూర్తయిన తరువాత 16వ రౌండు ఐదారు టేబుళ్లపై జరగడంతో లెక్కింపు పూర్తయి, ఫలితాన్ని ఉదయం 11.30 గంటల సమయానికే అధికారికంగా తెలుసుకునే అవకాశం ఉంది. ఒక్కో టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్‌తోపాటు మైక్రోఅబ్జర్వర్ ఉంటారు.

సినిమాలు



శ్యామల	:	గంగం గణేశా
సూర్యమినీ	:	మిస్టర్ అండ్ మిసెస్ మహి
సూర్యప్యాలెస్	:	భజే వాయువేగం
స్వామి	:	భజే వాయువేగం
శివజ్యోతి	:	లవ్‌మీ
అనుశ్రీ	:	హిట్ లిస్ట్
రాజా	:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ఊర్వశి	:	ఆ ఒక్కటీ అడక్కు
రంభ	:	రాజుయాదవ్
మేనక	:	బాక్
అప్సర	:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
నామవరం		
వీఎస్ మహల్	:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కడియం		
వెంకటసూర్య	:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజే వాయువేగం